

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,20 అక్టోబర్ 2025

8 పేజీలు


## సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై విస్తృత అవగాహన

### విలువ ఆధారిత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు

### - కలెక్టర్ కీర్తి చేకూరి -ఎమ్మెల్యే గోరంట్ల - జేసి వై.మేఘా స్వరూప్



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా ప్రజలకులభించే ఆర్థికప్రయోజనాలు ప్రతికుటుంబానికీ ఉప యుక్తం అవుతాయనీ, ఇది నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. వినియోగదారుల అవగాహనతో సరైన బిల్లులు తీసుకోవడం, పన్ను చెల్లింపులో పారదర్శకతతో దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఎమ్మెల్యే గోరంట్లబుచ్చయ్యచౌదరిఅన్నారు. వ్యాపారులు, వినియోగదారులు ఇద్దరూ సమానంగా లాభపడే విధంగా ఈకార్యక్రమం రూపుదిద్దు కున్నదని, ప్రజల్లోకి సమర్ధ వంతంగా తీసుకెళ్తున్నామని జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ పేర్కొన్నారు. ఆదివారం రాజ మహేంద్రవరం నగరంలోని పందిరి ఫంక్షన్ హాల్లో జరిగిన రాజమ హేంద్రవరం షాపింగ్ ఉత్సవ్లో భాగంగా "సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, రాజమ హేంద్రవరం రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా జీఎస్టీ నోడల్అధికారి వై.మేఘాస్వరూప్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యా రు. ముఖ్య అతిథులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రదర్శన కం అమ్మకాల స్టాల్స్‌ను సందర్శించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గత నెల రోజులుగా "సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్"పై అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించామని తెలిపారు. ఇలాంటి పథకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ప్రజా సంక్షేమ

- తరువాయి 2లో..

## తాత్కాలిక పటాకుల షాపుల పరిశీలన

### - కొవ్వూరు ఆర్డీవో రాణి సుశ్మిత



**నిడదవోలు,మేజర్‌న్యూస్ :** కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి రాణిసుశ్మిత ఆదివారం నిడదవోలు పట్టణంలో ఏర్పాటుచేసిన ఎల్.ఈ-5 తాత్కాలిక పటాకుల లైసెన్స్ షాపులను తనిఖీ చేశారు.దీపావళి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన తాత్కాలిక పటాకుల విక్రయ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక సదుపాయాలు, మరియు లైసెన్స్ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్న విషయాన్ని

- తరువాయి 2లో..

## రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి,మేజర్‌న్యూస్ :** దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ దీపావళి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో చీకట్లను చెరిపేసి సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కాలని,సాంస్కృతిక, కళా వైభవం విలసిల్లాలని, ఆంధ్రప్రదేశ్ లో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలని భగవంతుని ప్రార్థించారు. పర్యావరణహితంగా దీపావళిని ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

## దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

- బాణాసంచా పట్ల అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సుభాష్ శుభాకాంక్షలు



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని ప్రజలకు,కార్మికులందరికీ కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలుగించు కోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని ఆయన ఒక సందేశంలో పేర్కొన్నారు. జీవితమంటేనే చీకటి వెలుగుల సమాహారమని, దీపావళి నేర్పే పాఠం ఇదేనని ఆయన తెలిపారు. ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలని వెలుగుల పండుగ తెలుగువారి జీవితాల్లో వేల కాంతులు నింపాలని వాసంశెట్టి సుభాష్ ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకనే ప్రజలు, కార్మికుల జీవితాల్లో వెలుగు

- తరువాయి 2లో..

## కార్తీక మాసంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

### కమిషనర్ రాహుల్ మీనా -పుష్కర ఘాట్‌లో ఏర్పాట్ల పరిశీలన



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** కార్తీక మాసం నేపథ్యంలో గోదావరి స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పుష్కర ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల రద్దీకి తగినట్లు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి ఎలాంటి ఇబ్బందులు

- తరువాయి 2లో..

## భక్త జనంతో శోభిల్లిన వాడపల్లి క్షేత్రం





- స్వామివారిని దర్శించిన ఆర్డీవో శ్రీకర్
- అన్నదాన పథకానికి విరాళం

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లుతున్న శ్రీదేవి భూదేవి సమేత వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి దివ్య క్షేత్రం ఆదివారం భక్త జనంతో శోభిల్లింది. అష్టోత్తర పూజలు, కళ్యాణం జరిపించుకునే భక్తులతో ఆలయ ఆవరణ అంతా భక్తుల గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించింది. స్వామివారిని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.నిత్యఅన్నదాన పథకానికి ఆలమూరు మండలం, చొప్పెల్ల గ్రామానికి చెందిన తోట సూరిబాబు, నాగలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు రూ.50,116లు విరాళంగా అందించారు.వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతంపలికి తీర్థ ప్రసాదాలు అందించారు. దాతలకు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# జీఎస్టీ తగ్గింపుతో పెరగనున్న ప్రజల కొనుగోలు శక్తి





- పాత జీఎస్టీ వసూలు చేసే వ్యాపారస్తులపై ఫిర్యాదు చేస్తే చర్యలు
- పండుగ వాతావరణంలో హేలాపురి ఉత్సవం - షాపింగ్ ఫెస్టివల్

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జీఎస్టీ తగ్గించడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఆదివారం రాత్రి జరిగిన 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్..లో భాగంగా నిర్వహిస్తున్న 'హేలాపురి ఉత్సవం షాపింగ్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ద్వారా ప్రజలకు ఎంతో లబ్ది కలుగుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువులతో పాటు, ఎలక్ట్రానిక్స్, చిన్న, పెద్దతరహా వాహనాల ధరలు పెద్దఎత్తున తగ్గాయన్నారు. జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలు నెలకు 5 వేల నుండి 10 వేల రూపాయల వరకు ప్రతీ కుటుంబానికి ఆదా అవుతుందన్నారు. జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతీ కుటుంబానికి మరింత అవగాహన కలిగించేందుకు గత నెల రోజుల నుండి వివిధ అంశాలపై గ్రామ,వార్డ్ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో పండుగ వాతావరణంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు సామాన్యులకు ఒక వరమని,ప్రజల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చాయన్నారు. శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా 8 వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నప్పటికీ, పేదవారికి అన్ని వస్తువుల ధరలు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ రేట్లను తగ్గించాయన్నారు. ఈ సందర్భంగా హేలాపురి ఉత్సవం షాపింగ్ ఫెస్టివల్ లో 500 రూపాయలు, అంతకుమించి కొనుగోలు చేసిన వినియోగదారుల పేర్లను లక్కీ డ్రా తీసి ముగ్గురు విజేతలకు మొదటి



బహుమతిగా బైక్, రెండవ బహుమతిగా ఎయిర్ కండీషనర్, మూడవ బహుమతిగా ఎల్ ఈ డి టివిలను కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హేలాపురి ఉత్సవం.. షాపింగ్ ఫెస్టివల్ నిర్వహణకు సహకారం అందించిన దాతలు నవభారత్ లిమిటెడ్, గోద్రెజ్ అగ్రోవేట్ లిమిటెడ్, గోర్మెట్ పాప్ కార్నికా కంపెనీ, విన్నర్ సెరామిక్స్ లిమిటెడ్ యాజమాన్యాలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అభినందించారు. హేలాపురి ఉత్సవం.. షాపింగ్ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాలను పెద్దఎత్తున బాణాసంచాలతో పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్‌తో సెల్ఫీ దిగేందుకు విద్యార్థినులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్ నాగార్జునరావు, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ ఎం.శ్రీహరి,ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ.భానుప్రతాప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులందరికీ దీపావళి శుభాకాంక్షలు : సొసైటీ చైర్మన్ 'సరిపల్లి'



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** మండలంలోని రైతులు ప్రజలు కుటుంబ సభ్యులతో దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని జీలుగుమిల్లి సొసైటీ చైర్మన్ సరిపల్లి సత్యనారాయణ రాజు అన్నారు. ప్రభుత్వం సూచించిన నియమాలతో కుటుంబ సభ్యులు పండుగ జరుపుకోవాలని సూచించారు. యువత బాణాసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్నందున అప్రమత్తతో పండుగ జరుపుకోవాలని అన్నారు. సొసైటీ పరిధిలోని రైతులందరికీ కార్యాలయంలో ఎటువంటి పనులు ఉన్న తక్షణమే తన సంప్రదించాలని సూచించారు. తన పరిధిలో ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలను అందిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

# మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి





**- 61 మందికి రూ.20 లక్షలు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి**

**పాలకొల్లు,మేజర్ న్యూస్:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అటువంటి మంచి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కోరారు. చంద్రబాబు సమర్ధ పాలనకు పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యానికి అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి నిదర్శనమన్నారు. పాలకొల్లులోని ఆయన కార్యాలయంలోఆదివారం సాయంత్రం పాలకొల్లు నియోజకవర్గం లో పేద మధ్యతరగతి వర్గాలకు చెందిన 61మందికి 20లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ మంచి చేసే కూటమి ప్రభుత్వంను అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదించాలని,జరిగిన మేలును 10 మందికి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మానవత్వంతో పేద వర్గాలకు వైద్య ఖర్చులు అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించారన్నారు.

నాడు జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడన్నారు. గ్రామస్థాయి నుంచి నావరకుకూటమి నాయకులంతా సేవాదృక్పథంతో పనిచేస్తున్నారన్నారు. ఒకేరోజు 61 మందికి 20 లక్షలు వైద్యసాయం అందించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రిరామా నాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లబుచ్చారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై విస్తృత అవగాహన

మొదటిపేజి తరువాయి

కార్యక్రమాలకే వెళ్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, జీఎస్టీ 2.0 సంస్క రణలు వలన పన్నుల పారదర్శకతతో పాటు ప్రజలకు లబ్ది చేకూరుతోందన్నారు. బిల్లులు తీసుకోవడం ద్వారాపన్నుల్లో పడే భాగస్వామ్యం ప్రజలకు స్పష్టంగా తెలు స్తుందని, ప్రతి వినియోగదారుడు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు జీఎస్టీ నోడల్ అధికారి వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు "సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్" పై గత నెల రోజులుగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ బి.సుధాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 4,300అవగాహన కార్యక్రమాలు చేపట్టి, జీఎస్టీ చాంపియన్లు ప్రతి ఇంటికి వెళ్లి ధరల్లో వ్యత్యాసాలపై వివరాలు అందించారని తెలిపారు. ఉత్పత్తులకు తగిన ప్రోత్సాహం, వినియోగదారుల్లో అవగాహన పెంపుతో ఆర్థిక లావాదేవీల పారదర్శకత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ (ఎస్టి) ఎం. సుధాకర్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ టీవీ. నాగేశ్వరరావు, జీఎస్టీ అధికారి హుస్సేన్ షరీఫ్, డిప్యూటీ ఏసీ కె. సురేష్ కుమార్, సిపిఓ జెడి, జిల్లా జీఎస్టీ కమాండ్ కంట్రోల్ రూమ్ నోడల్ ఆఫీసర్ వై.అప్పలకొండ, అడిషనల్ ఎస్పీ ఏ.వి.సుబ్బరాజు,పి.డి డిఆర్డిఏ ఎన్.వి.వి.ఎస్. మూర్తి,యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల నాగేశ్వరరావు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దామణి,తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

మొదటిపేజి తరువాయి

జిలుగులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. జీవితం కష్టసుఖాల కలబోత, చీకటి వెలుగుల విరిపూత కష్టాల్లోనూ సుఖాన్ని కలగనడం ఆశాజీవుల లక్షణం. ఇదే చిమ్మ చీకట్లను వెలిగించే దివ్య దీపావళి చెబుతున్న సందేశమని సుభాష్ తెలియజేశారు.

# తాత్కాలిక పటాకుల షాపుల పరిశీలన

మొదటిపేజి తరువాయి

క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణి సుశ్మిత మాట్లాడుతూ, పటాకుల దుకాణాల్లో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని, అనుమతి లేని చోట పటాకుల విక్రయం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు కూడా సురక్షిత దూరం పాటిస్తూ పటాకులు కాల్చాలని సూచించారు.

# కార్తీక మాసంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

మొదటిపేజి తరువాయి

తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. లైటింగ్, సీసీ కెమెరాలు, త్రాగునీరు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకొను గదులు, లాకర్లను పరిశీలించారు.

పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టంతో పాటు స్విమ్మర్లను, పడవలను సరిపడా అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఘాట్ వెంబడి నది ఒడ్డున ఇసుక వేయించాలని.. అలాగే పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్తీకమాస దీపోత్సవ వేడుకలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆయన వెంట ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఈఈ మాధవి, డీఈ సత్యనారాయణ, ఏఈలు వెంకటేష్, ఆంజనేయులు ఉన్నారు.

# కబడ్డీలో సత్తా చాటిన డిగ్రీ కళాశాల విద్యార్థులు






**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ కబడ్డీ ఉమెన్స్ టీమ్ రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ కాలేజీయేట్ కమ్ ఇంటర్ యూనివర్సిటీ సెలెక్షన్స్‌లో సత్తా చాటారు. జి.మామిడాడ డి.యల్.ఆర్. డిగ్రీ కాలేజ్‌లో ఈనెల 12, 13 కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొదటి రోజు నాకౌట్ మ్యాచ్స్ లో వరుస విజయాలుతో లీగ్ మ్యాచ్స్ లోకి ప్రవేశించారు. లీగ్ మ్యాచ్స్ అడి నాల్గవ స్థానం కైవసం చేసుకున్నారు. అలాగే ఆదికవి నన్నయ యూనివర్సిటీ కబడ్డీ ఉమెన్స్ టీమ్‌కి బి.యస్సీ బోటనీ తృతీయ సంవత్సరం యమ్. ప్రవీణా, బి.ఏ. ఎకనామిక్స్ పి.శ్రావణి సంధ్య సెలెక్ట్ అయ్యారు. వినాయక మిషన్స్ రీసెర్చ్ ఫౌండేషన్ - సాలెం, తమిళనాడులో అక్టోబర్ 29 నుండి నుండి నవంబర్ 2వ తేది వరకు కబడ్డీ ఉమెన్స్ టీమ్ ఆడుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తెలియజేసారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.వసుధ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కబడ్డీ ఉమెన్స్ టీమ్‌లోఉన్న విద్యార్థినీలను, వ్యాయామ ఆధ్యాపకుడు కె.ప్రభాకరరావును అభినందించారు.

**యోగలో మెరిసిన డిగ్రీ కళాశాల విద్యార్థులు...**రంపచోడవరం గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ యోగ ఉమెన్స్ టీమ్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ అదేశాలు మేరకు ఇంటర్ యూనివర్సిటీ సెలెక్షన్ ట్రాయిల్స్ రాజమహేంద్రవరంలో యస్.జి.యస్. గవర్నమెంట్ ఐ.ఏ.యస్.ఇ. ట్రైనింగ్ కాలేజ్‌లో ఈనెల 15వ తేదిన నిర్వహించారు. యోగ ఆసనాలలో మంచి ప్రతిభతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ యోగ ఉమెన్స్ టీమ్‌కి బీ.ఏ. ఎకనామిక్స్ పి.శ్రావణి సంధ్య సెలెక్ట్ అయ్యారు. అలాగే స్టాండ్ బై గా పి. మౌనిక ఫస్ట్ ఇయర్ బి.కామ్ సెలెక్ట్ అయ్యారు. ఎస్.వి.వై. ఏ.ఎస్.ఏ. యూనివర్సిటీ, బెంగుళూరులో నవంబర్ 24 నుంచి 28 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తెలియజేసారు.

ఈ సందర్భంగా విద్యార్థినీలకు అభినందనలు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ డి.రవికుమార్ వ్యాయామ ఆధ్యాపకుడు కె.ప్రభాకర్ రావు, అలాగే అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సెలెక్ట్ అయిన విద్యార్థినిలకు అభినందనలు తెలియజేశారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో ఏలేటి పెద్ద వీరన్న మెమోరియల్ జిల్లా పరిషత్ హై స్కూల్లో 1970-75 మధ్యలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కాట్రావులపల్లి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ గెట్ టుగెదర్ కార్యక్రమంలో వీరంతా పాల్గొన్నారు.. వీరు సుమారు అర్థ శతాబ్దం తర్వాత ఓకే వేదికపై సందడి చేశారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. వృద్ధాప్య దశకు చేరుకున్న వారంతా ఎక్కడెక్కడో స్థిర పడటంతో పాటు కొంతమంది పదవీ విరమణ పొంది విశ్రాంతి తీసుకుంటున్నారు. వారిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం పిలుపు ఉత్సాహం నింపింది. హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, చెన్నై వంటి దూర ప్రాంతా సుమారు 75 మంది తమ చదువుతున్న పాఠశాలలో తోటి స్నేహితులతో సందడిగా గడిపారు. ఈ సందర్భంగా పలువురిని సాలువాలు,పూలమాలతో సత్కరించి,జ్ఞాపికలు అందజేశారు.ఇప్పటికే తమతో చదువుకున్న కొంతమంది మృతి చెందడంతో వారి మృతికి సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన కాట్రావులపల్లి నీటి సంఘం అధ్యక్షులు కంటే రామారావు (బుల్లబు), గ్రామ సర్పంచ్ పిట్ట సుగుణ రావు, షేక్ జిన్నా, కొంగర వెంకటనారాయణ, ఏలేటి పద్మ ప్రసాద్, జల్లంగి వీరభద్రరావు, కృష్ణ ప్రసాద్, వెంకట్రావు, దేవ గుప్తావు, వెంకట్రావు, కాట్రావులపల్లి ప్రధానోపాధ్యాయులు తాతపూడి వెంకటరమణతో పాటు పూర్వ విద్యార్థులు 75 మంది పాల్గొన్నారు.

# ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల సముద్రతీర పరిరక్షణ కార్యక్రమం






**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు బీచ్‌నందు వ్యర్థాలను తొలగించే సముద్రతీర పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టినట్టు ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ భూమిని కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపైన ఉంది, మొక్కలు నాటడం ద్వారా, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటివి చేయడం ద్వారా భూమిని పరిరక్షించుకోవచ్చు అని తెలిపారు.

ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ రోజురోజుకీ భూమి సారం క్షీణించిపోతుందని, మనం చేసే కొన్ని రకాల పనుల వలన ఈ విధంగా కోల్పోతున్నామని, భవిష్యత్తు తరాలు సుఖంగా ఆరోగ్యంగా జీవితాన్ని గడపాలి అంటే ప్రస్తుతం మనం మన భూమిని రక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగశ్రీకాంత్, జాతీయ సేవా పథక కార్యనర్వహణాధికారులు పి.సురేఖ, ఫిజికల్ డైరెక్టర్ యన్.సత్యవతి అధిక సంఖ్యలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఆక్రమణల చెరలో... పిఠాపురం ప్రధాన రహదారి

– కొరవడిన అధికారుల పర్యవేక్షణ





**పిఠాపురం,మేజర్‌న్యూస్:** పిఠాపురం పట్టణ ప్రధాన రహదారి ఆక్రమణల చెరలో బందీగా మారింది. పిఠాపురం మెయిన్‌రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో వాహనదారులు పిఠాపురం ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పిఠాపురం పట్టణం ప్రారంభం నుండి చివరివరకు ప్రధాన రహదారి వెంబడి ఆటో స్టాండ్లు, లారీ, కార్ స్టాండ్లు, బడ్డీకొట్లు, చేపల బజార్లు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ స్థలాల యజమానులు ప్రధాన రహదారి డ్రైన్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో చిన్నపాటి వర్షానికే నీట మునుగుతున్నాయి. కళ్ళ ఎదుట ఇంత జరుగుతున్నా... సంబంధిత శాఖల అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ట్రాఫిక్ నియంత్రణ నియంత్రణలో లేదనే చెప్పాలి. అప్పుడప్పుడు పోలీసు వారు హడావుడి చేసినా షరా మామూలుగా మారడం పరిపాటిగా మారింది. ఆర్‌ఆర్‌బి హెచ్‌ఆర్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి, సంఘ ప్రతినిధి కొండెపూడి శంకర్రావు మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబందిత అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టాలని, లేని పక్షంలో ప్రభుత్వ పాఠశాల స్థలాలను తిరిగి అప్పగించగలరని కోరుతున్నామన్నారు.

# 8 మంది లబ్ధిదారులకు రూ.13.55 లక్షలు

– సిఎం సహాయనిధి చెక్కులు అందించిన ఆప్కాబ్ చైర్మన్ 'గన్ని'



**భీమడోలు,మేజర్ న్యూస్ :** ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న 28 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిని ఆదివారం అందజేసినట్లు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. వీరందరికీ ఆప్కాబ్ చైర్మన్ సిఫారసు మేరకు లబ్ధి విడుదలైందని ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని భీమడోలు మండలానికి చెందిన పదిమంది, గణపవరం మండలానికి చెందిన ఏడుగురు, నిడమర్రు మండలానికి చెందిన ముగ్గురు, ఉంగుటూరు మండలానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ. 13.55 లక్షలు మంజూరయ్యాయి.వీటిని ఆయా మండలాలకు చెందిన టిడిపి,కూటమి నాయకుల సమక్షంలో టిడిపిపార్టీ కార్యాలయం లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏ.ఎం.సి.చైర్మన్ శేషగిరి, జడ్పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# 'ఆదిత్య'లో రంగ్‌మంచ్ సాంస్కృతిక కళావేదిక







కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో రంగ్‌మంచ్ సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు కన్నులపండుగలా జరిగాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ యన్. సుగుణారెడ్డి మాట్లాడుతూ దీపావళి అంటే చీకటిపై వెలుగులు, చెడుపై మంచి విజయానికి సంకేతం అని తెలిపారు. ఈ దీపావళి అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, కాలుష్యరహిత దీపావళి జరుపుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ దీపావళి పండుగ భారతీయులందరికీ ఆనందం, వెలుగుల పండుగ అని తెలిపారు. దీపాలను వెలిగించి, లక్ష్మీపూజ చేసి, సంపద మరియు శ్రేయస్సు సంపాదించేందుకు మనం ప్రార్థిస్తాము అని తెలిపారు. ఈ పండుగ ద్వారా సమాజంలో ఏకత, స్నేహం పెరుగుతుందని, అందరూ సంతోషంగా జీవింతాలి అని తెలిపారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ దీపావళి సందర్భంగా తమ కళాశాలలో విద్యార్థినులు దీపావళి వృత్తాంతాన్ని ప్రదర్శనరూపంలో అలరించారని, మట్టితో విద్యార్థినులు ప్రమిదలను తయారుచేసి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారని, రంగవల్లికలతో, దీపాలతో అలంకరించారని తెలిపారు. అలాగే అధ్యాపకులకు కూడా క్విజ్ నిర్వహించి విజేతలను ఎంపికచేసి, బహుమతులు అందజేశామని



తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ దీపాలపండుగ అంటే మనిషితో ఉన్న అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానదీపాన్ని వెలిగించేదని తెలిపారు. అందరూ సంతోషంగా, క్షేమంగా దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటిలలో విజేతలైన అధ్యాపకులకు విద్యార్థినులకు బహుమతులు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగ్‌మంచ్ కళావేదిక నిర్వాహకులు సి.హెచ్. దివ్యభారతి, యస్.మరియమ్ రిజ్వానా మరియు విద్యావాలంటీర్లు చిత్ర, మాన్య, సంధ్య గౌతమిని మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# దీపావళి పటాకుల షాపుల్లో భద్రతా ఏర్పాట్లు పరిశీలన

**– జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.మార్టిన్ లూథర్ కింగ్**

**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** దీపావళి పండుగను పురస్కరించుకుని కొవ్వూరు పట్టణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పటాకుల లైసెన్స్ షాపులను, అక్కడ భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, షాపుల నిర్వాహకులకు తగిన సూచనలు చేయడం జరిగిందని జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.మార్టిన్ లూథర్ కింగ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పటాకుల షాపుల్లో ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరును పరీక్షించారు. అలాగే అగ్నిమాపక సిబ్బందితో కలిసి భద్రతా ప్రమాణాలు, అగ్ని నిరోధక చర్యలు, షాపుల మధ్య దూరం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అగ్నిప్రమాదాలను నివారించడానికి షాపుల్లో తగినంత మట్టి, నీటి బకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు.



ప్రజలు, విక్రేతలు సురక్షిత దూరం పాటిస్తూ, అగ్నిమాపక శాఖ సూచనలు కచ్చితంగా పాటించాలన్నారు. దీపావళి సందర్భంగా ప్రజల భద్రతను కాపాడటానికి అగ్నిమాపక శాఖ పూర్తి సన్నద్ధతతో ఉందని జిల్లా అధికారి తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల ఉద్యోగాల్లో జనసేనకు అన్యాయం



**శంఖవరం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పౌరసరఫరా, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అనుబంధంగా రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నియమించిన ఉద్యోగాల్లో తమకు అన్యాయం జరిగిందని జనసేన పార్టీ కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంనకు సంబంధించి ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల రైతు సేవా కేంద్రాల ధాన్యం కొనుగోలు సిబ్బంది నియామకాల్లో వివక్షాపూరితంగా వ్యవహరించారనీ, మొత్తం ఉద్యోగాలు అన్నింటిలోనూ తెలుగు దేశం పార్టీ వారినే నియమించు కున్నారనీ, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయిన జనసేన పార్టీని విస్మరించి, వారికి ఉద్యోగాలు ఇవ్వలేదని ఆరోపిస్తూ, తమకు కూడా ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని జనసైనికులు కోరుతున్నారు.

ఈ మేరకు విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లె నాగేశ్వరరావు నేతృత్వంలో నియోజకవర్గంలోని కొంతమంది జనసైనికులు ఆదివారం కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఇంటికి వెళ్ళి ఆయనకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 2024-2025 ఖరీఫ్, రబీ పంట కాలాలకు సంబంధించి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలం 9, ప్రత్తిపాడు మండలం 13, శంఖవరం మండలం 4, రౌతులపూడి మండలం 7 చొప్పున మొత్తం 33 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 99 పోస్టులు అనగా టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఆపరేటర్, హెల్పర్ పోస్టుల్లో ఇప్పటికే సిబ్బందిని నియమించారనీ, వీరందరూ తెలుగుదేశం పార్టీ వారేనని ఎంపీకి వివరించారు. 33 కేంద్రాల్లో 99 పోస్టుల్లో మిత్రపక్షమైన జనసేన పార్టీకి ఎన్ని కేటాయిస్తారో తెలపాలని జనసైనికులు కోరుతున్నారు.

## పెద్దల సమక్షంలో క్రాకర్స్ వెలిగించండి

– డాక్టర్ శ్రీరామ్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** దీపావళి సందర్భంగా బాణాసంచా వెలిగించే సమయంలో పెద్దల సమక్షంలో పిల్లలు ఈ కార్యక్రమాన్ని ఆనందంగా జరుపుకోవాలని ప్రభుత్వ ఉత్తమ సేవ పురస్కార గ్రహీత నయన కంటి ఆసుపత్రి అధినేత రాష్ట్ర నేత్ర వైద్యుల సంఘ ఎలెక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీరామ్ రావుల అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ సూచన మేరకు దీపావళి పండుగపై ప్రత్యేక అవగాహన విషయాన్ని వెల్లడిస్తున్నానని ఆయన అన్నారు. క్రాకర్స్ కాలుస్తున్నప్పుడు వచ్చే వెలుగు మరియు పొగ నుండి కన్నులను రక్షించుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వీలుంటే కంటి అద్దాలను ఉపయోగించుకోవడం ద్వారా వాటినుండి రక్షించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని డాక్టర్ శ్రీరామ్ చెప్పారు. పిల్లలకు క్రాకర్స్ పట్ల ఎన్ని జాగ్రత్తలు చెప్పినప్పటికీ అవగాహన చేసుకునే పరిస్థితులు చాలా తక్కువగా ఉంటాయని అందుకనే పేరెంట్స్ కానీ పెద్దవాళ్ళు కానీ వాళ్ల సంరక్షణలో దీపావళి క్రాకర్స్ వెలుగుంచుకునే కార్యక్రమం నిర్వహించుకోవడం ద్వారా ప్రమాదాల నుండి కాపాడేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని డాక్టర్ శ్రీరామ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దీపావళి సందర్భంగా ఇప్పటికే పలు ప్రసార మాధ్యమాలు ద్వారా ప్రభుత్వము మరియు వైద్యులు చేస్తున్న సూచనలను అనుసరించాల్సిందిగా ఆయన కోరారు. గత కొద్ది సంవత్సరాలుగా జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని సామాజిక సేవా సంఘాలు కూడా స్వచ్ఛందంగా ఈ అంశం పట్ల ప్రత్యేకత శ్రద్ధ తీసుకోవాల్సిందిగా డాక్టర్ శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. ప్రమాదం జరిగినప్పుడు సమీపంలో ఉన్న కంటి ఆసుపత్రులు వైద్య సిబ్బందిని సంప్రదించాల్సిందిగా డాక్టర్ శ్రీరామ్ సూచించారు.

# రామకృష్ణ మిషన్ వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు

**– రోగులకు అన్నదానం**





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో స్థానిక సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఆసుపత్రి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలియచేసారు. ఈ వైద్య శిభిరంలో డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, డాక్టర్ ఉమా మహేష్ పాల్గొని సుమారు 200 మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజీ తెలియచేసారు. అవసరం అయినవారికి 67మందికి రక్తపరీక్షలు, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు, నలుగురికీ ఇ.సి.జి లు, 6 మందికి ఎక్స్‌రే లు, 15 మందికి ఫిజియథెరపీ చేసినట్లు స్వామీజి తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ విజ్ఞప్తి చేశారు. ఈ వైద్య శిబిరంలో మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు, రోగులకు, సహాయకులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

# చట్టాలు కోల్పోతే ఆదివాసీ హక్కులు ఉండవు



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** చట్టాలు కోల్పోతే ఆదివాసీ హక్కులు ఉండవని, చట్టాలు అమలు చేయని అధికారులపై క్రిమినల్ కేసులు వేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను అన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం దిరిసిన పల్లి గ్రామంలో ఆదివారం ఆదివాసీ హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ఆదివాసులకు సంక్రమించిన చట్టాలు అమలు కాకుంటే భవిష్యత్తులో ఆదివాసులు వారి హక్కులకు దూరమవుతారని, కాబట్టి ఆదివాసీలందరూ ఆదివాసి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలియజేశారు. 1/70 చట్టం ఏజెన్సీ ప్రాంతాల్లో పటిష్టంగా అమలు చేయకపోవడం వలన ఆదివాసీ భూములు, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, అంతేకాక ఏజెన్సీ చట్టాలన్నిటికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్స్ అన్నిటికీ 1/70 చట్టమే మూలాధారమన్నారు. ప్రస్తుతం నాన్ ట్రైబల్స్ వలసల వలన ఆదివాసీ చట్టాలు నీరు గారి పోతున్నాయని, కాబట్టి ఆదివాసులందరూ ఐక్యమై చట్టాలు అమలు కోసం పోరాడవలసిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ఆదివాసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నెంబర్ 3 కొంతమంది నాన్ ట్రైబల్స్ కుట్ర వలన రద్దు చేయబడిందని, 1/70 చట్టం కోల్పోతే ఆదివాసీ భవిష్యత్ తరాలకు మనుగడ ఉండదన్నారు. చట్టాల అమలు చేసే విషయంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం విడాలని, 1/70 చట్టం, దాని సవరణ 1978 సెక్షన్ 3(5) ప్రకారం ఏజెన్సీలో ఈ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమ కట్టడాలు కట్టినా, వ్యాపారాలు చేసినా, భూ అక్రమణులకు పాల్పడినా సంబంధిత అధికారులు కబ్జాకు పాల్పడిన నాన్ ట్రైబల్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

అలాగే చట్టాన్ని ఉల్లంఘించారని తెలిసి అధికారులు సంబంధిత నాన్ ట్రైబల్స్ పై క్రిమినల్ కేసులు వేయకపోతే అధికారులు క్రిమినల్ కేసులకు గురి కావలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులు ఇప్పుడిప్పుడే విద్య, ఉద్యోగ రంగంలో రాణిస్తున్న తరుణంలో ఉద్యోగ రిజర్వేషన్ కోల్పోయారని, తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 3 ను చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఐదవ షెడ్యూల్ భూభాగంలో ఆర్టికల్ 244(1) ప్రకారం షెడ్యూల్ ప్రాంతంలో సర్వ హక్కులు ఆదివాసులకే కల్పిస్తున్నట్లు రాజ్యాంగం చెబుతున్నప్పటికీ, ఏజెన్సీ ప్రాంతాల్లో నాన్ ట్రైబల్స్‌కు ఏ విధంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మైదాన ప్రాంత నాన్ ట్రైబల్స్‌కు ఏజెన్సీలో ఉద్యోగాలు ఇవ్వడమంటే రాజ్యాంగాన్నిఉల్లంఘించటమేనని, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అధికారులపై క్రిమినల్ కేసులు వెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదివాసీలందరూ వారి సంస్కృతిని పాటిస్తూ హక్కులు సాధించడం కోసం చట్టాలు అమలు కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు మోడిద నూకరాజు, డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, ఆదివాసీ పెద్దలు కారం పోతురాజు దొర, బెల్లం చిన్నాల దొర, బెల్లం వెంకటలక్ష్మి, కారం రాంబాబు, కారం సుబ్బలక్ష్మి, బంధం మల్లమ్మ, పొడియం జోగమ్మ, బల్లెం బుల్లెమ్మ, కోసు వీరస్వామి దొర తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ సెమినార్‌లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**- ఉత్తమ ప్రజెంటేషన్‌తో అలరించిన ఫిషరీస్ విద్యార్థులు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల డిపార్ట్మెంట్ అఫ్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ కు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు "ఆక్వా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్ మరియు ఛాలెంజెస్ "నేషనల్ సెమినార్‌లో బహుమతులు సాధించారని ఆదిత్య డిగ్రీ మరియు పీ.జి క ళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలియజేశారు.

తణుకు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో "ఆక్వా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్ మరియు ఛాలెంజెస్ " నేషనల్ సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్టం నలుమూలల నుండి వివిధ కళాశాలలకు చెందిన సబ్జెక్ట్ ఎక్స్పర్ట్స్ అండ్ విద్యార్థులు పాల్గొనగా, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు పరిశోధనాత్మక ప్రాజెక్టులు, వ్యాపార ప్రణాళికలు మరియు ఆవిష్కరణల ద్వారా న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఫిష్ ఫార్మింగ్‌లో వినూత్న ఆవిష్కరణలు, శాస్త్రీయ విధానాల ఆధారంగా వ్యాపార అభివృద్ధి వంటి అంశాలలో ఆదిత్య విద్యార్థుల ప్రదర్శన ప్రశంసనీయంగా నిలిచింది. నిర్వాహకులు వారికి ప్రశంస పత్రాలను జ్ఞాపికలను అందించారు. విజేతలను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఫిషరీస్ విభాగాధిపతి డాక్టర్ కె నరసింహమూర్తి, ఆధ్యాపకులు అభినందించారు.

# శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం - పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 1న గోరింటలో "ఏకాహాం"

**- శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు**



**పెద్దాపురం రూరల్,మేజర్ న్యూస్:** పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో పెద రామాలయం వద్ద స్వస్తిశ్రీ ఛాంద్రమాన శ్రీ విశ్వవసు నామ సంవత్సర కార్తిక ఏకాదశి పురస్కరించుకుని నవంబర్ 1వ తేదిన ఏకాదశి సందర్భంగా ఏకాహా భజన కార్యక్రమం నిర్వహించబడునని శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదిన శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభమై, ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఈ ఏకాహా భజన కార్యక్రమం శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం వారి ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో ఆలయ కమిటి, గ్రామ ప్రజల సహకారంతో ఉదయం 5 గంటలకు పూజా కార్యక్రమంతో ప్రారంభమై ఉదయం 6 గంటల నుండి భజన కార్యక్రమం ప్రారంభమగునని ప్రసాదరావు తెలిపారు. ఈ ఏకాహా కార్యక్రమంలో భజన సమాజాలుశ్రీ శివరామ బాలభక్త భజన సమాజం (గోరింట), శ్రీ ఓంశక్తి మహిళా భజన సమాజం (గోరిం ట), శ్రీ కేదారేశ్వర గాయత్రి మహిళా భజన సమాజం (గుడివాడ), శ్రీ సీతారామ భజన సమాజం (ఎలిశెట్టి కామరాజు బృందం, కాంద్రకోట), శ్రీ గంగా విఘ్నేశ్వర మహిళా భజన సమాజం (జువ్వల వీరలక్ష్మి బృందం, ధర్మవరం), శ్రీ షిరిడి సాయి మహిళా భజన సమాజం (గోరింట) పాల్గొననున్నాయని ప్రసాదరావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం సభ్యులు, హార్మోనియం, వాయిద్య, డోలక్ కళాకారులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొననున్నారని ప్రసాదరావు తెలిపారు.

# డేంజర్ యమ డేంజర్

- ప్రాణాలతో చెలగాటమాడుతున్న దీపావళి సామాన్ల అమ్మకాలు
- నిబంధనలు పాటించని షాపుల యాజమానులు
- అలంకారప్రాయంగా కాళీ వాటర్ కాళీ వాటర్ పీపాలు, ఫైర్ సేఫ్టీ
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- అగ్ని మాపక సిబ్బంది ఉన్నా ఉన్న ప్రయోజనం సున్నా

**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** డేంజర్ యమ డేంజర్ అన్నట్లు ఉంది దీపావళి సామాన్లు అమ్మే యజమానులు పరిస్థితి కనపడుతుంది. పోతే ఎదుటివాటి ప్రాణమే కదాఅన్నట్టు సేఫ్టీలు లేకుండా దీపావళి సామాగ్రి అమ్మకాలు సాగించడం గమనార్హం. ఈ సంఘటన ఎక్కడో కాదండి గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట, మరియు జెడ్ రాగంపేట పంచాయతీ పరిధిలోని 16 నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఒక ప్రదేశంలో ఒకపక్క ప్రైవేట్ ఆస్పత్రి, మరో పక్క ప్రభుత్వ ఆసుపత్రి మధ్య నడుపుతున్న ఘటన.

అధికారులకు చేతులు తడిపి వ్యాపారులు ప్రజల ప్రాణాలతో ఫైర్ సేఫ్టీలు నిర్వహించకుండా అమ్మకారి కొనసాగిస్తున్నారు. పేరుకు మాత్రం అగ్నిమాపక ఔట్ పోస్ట్ ఆ ప్రదేశంలో పెట్టినప్పటికీ ఉపయోగం లేదని కొంతమంది కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నారు. నీరు లేకుండా కాళీ పీపాలు దర్శనం ఇవ్వడం షాపులు వద్ద ఇసుక, వంటి ఫైర్ సేఫ్టీ లేకపోవడం కొనుగోలుదారులను కలవర పరుస్తోంది. గత కొన్ని రోజుల క్రితం అంబేద్కర్ కోనసీమ జిల్లాలో దీపావళి సామాగ్రి తయారుచేసే గోడౌన్‌లో అగ్రి ప్రమాదం జరిగి కొన్ని ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు జరిగినప్పటికీ తూతూ మంత్రంగా పోలీస్ అధికారులు,



అగ్నిమాపక సిబ్బంది నామమాత్రపు దాడుల నిర్వహించారు తప్ప పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అటువంటి ప్రమాదాలు జరిగితేగాని అధికారులు అప్రమత్తం అవుతారని పలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి జాగ్రత్తలు లేకుండా దీపావళి సామాగ్రి అమ్మకంపై కొనుగోలుదారులు భయాందోళన చెందుతున్నారు. ఒకప్పుడు జగ్గంపేటలోని షాపులువద్ద భారీ ప్రమాదం జరిగి రాష్ట్రమంతా ఉలిక్కిపడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి షాపు యజమానులు ఫైర్ సేఫ్టీ వంటి జాగ్రత్తలు తీసుకుని విధంగా అధికారులు చూడాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.

# ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

– ఏపీ ఎన్జీవోస్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** దీపావళి కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డిఏను విడుదల చేయడం, 60 రోజుల్లో హెల్త్‌కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించడం, ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్‌లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఏపీ ఎన్జీవోస్ మరియు ఏపీ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, ముఖ్యమంత్రితో మరియు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన, హుందాతన చర్చలు...దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో జరగడం... సంతోషదాయకమని వారు పేర్కొన్నారు. చైల్డ్ కేర్ లీవ్‌పై ముఖ్యమంత్రి చేసిన ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపిందని తెలిపారు. హెల్త్ కార్డుల విషయంలో ప్యాకేజీ రేట్లు పెంచడం, జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స పరిమితిని రూ.50,000 నుండి రూ.1,00,000కి పెంచడం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నేరుగా ట్రస్ట్ ఖాతాలో జమయ్యేలా చూడటం, వైద్య సేవల సీలింగ్‌ను రూ.2 లక్షల నుండి రూ.5 లక్షల పైబడేలా పెంచడం, అలాగే ఆరోగ్యశ్రీ (ఈహెచ్ఎస్) విధానాన్ని ఇన్సూరెన్స్ మోడల్‌గా మార్చే అవకాశాలను పరిశీలించాలని కమిటీకి ఆదేశించడం.. ఇవన్నీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ముఖ్యంగా పెన్షనర్లలో ఆనందాన్ని కలిగించే నిర్ణయాలుగా పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు, ఎన్జీవో హోమ్‌లను గతంలో మాదిరిగానే ప్రాపర్టీ టాక్స్ నుంచి మినహాయించడం, అలాగే చెల్లించవలసిన బకాయిలను రద్దు చేయడం కూడా హర్షణీయమని తెలిపారు.దీపావళికి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి, ఆ సమావేశాన్ని సాధించగలిగిన ఏపీ జేఏసీ అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి. రమణకి ఉద్యోగ సంఘాల తరఫున అభినందనలు తెలిపారు. పిఆర్సి కమిటీ ఏర్పాటు విషయంలోనూ, 57వ మెమో ప్రకారం సుమారు 11,000 మంది ఉద్యోగులను ఓపిఎస్ పద్ధతిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడాన్ని కూడా జేఏసీ హర్షించింది. మిగిలిన సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల సాధనలో ఇది మొదటి అడుగు మాత్రమేనని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, గ్రామ వార్డు సచివాలయాల నోషనల్ ఇంక్రిమెంట్లు ప్రమోషన్స్, గురుకుల పాఠశాలలో ప్రభుత్వ రంగ సంస్థల వయోపరిమితి 60 నుంచి 62 పెంచడం, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత మరియు ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం చేయడం, మిగతా అన్ని అంశాల పరిష్కారం కోసం విద్యాసాగర్, రమణ ల నాయకత్వంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మరియు ఏపీ జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌కి, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి, చీఫ్ సెక్రటరీ కే.విజయానంద్‌కి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు ఏపీ ఎన్జీవోస్ మరియు ఏపీ జేఏసీ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అత్యవసర సమావేశం కాకినాడ ఎన్.జీ.ఓ హోమ్ ఏర్పాటు చేసి ఉద్యోగుల పక్షాన జిల్లా నాయకత్వం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జే.ఏ.సి చైర్మన్ మరియు ఏ.పి.ఎన్.జీ.జీ.ఓస్ అసోసియేషన్ అధ్యక్షులు గుద్దటి రామ్ మోహన్ రావు, కార్యదర్శి పేపకయాల వెంకట కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా నాయకత్వం మట్టపర్తి వెంకటేశ్వర రావు, పాలపర్తి మూర్తి బాబు, సరెళ్ల చంద్రరావు, కే.వీ.ఎన్.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విజయనగరం జిల్లా రాజాంలో జి.యమ్.ఆర్ వరలక్ష్మి కళాక్షేత్రంను ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** భారతీ య సంస్కృతికి, సాంప్రదాయానికి మార్గ దర్శకమైన కళలను పరిరక్షించి భావిత రాలకు అందించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం సాంస్కృతిక, కళారంగానికి పెద్దపీట వేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కళాకారులకు అందరితోపాటు కాకుండా ప్రత్యేక పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.నాటక సమాజాలు రిజిస్టర్ చేసుకోవాలని సూచిం చారు. సంబంధిత డేటా బ్యాంక్‌తో కళాకారులకు ప్రభుత్వం తరపున అవసరమైన సౌక ర్యాలు అందించేందుకు వీలు కలుగు తుందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. కళారంగం అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని పిలుపు..సీఎం,డిప్యూటీ సీఎంలతో చర్చించి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కళల జీవం పోసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, కళల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కళలకు ప్రాధాన్యతనివ్వ లేదని, కళారంగాన్ని పట్టించుకోలేదని మంత్రి దుర్గేష్ విమర్శించారు. ఏపీకి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేటాయించే ందుకు సూత్రప్రాయంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అంగీకరించారని మంత్రి దుర్గేష్ తెలిపారు.

## మహిళలకు రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న ఒక మహిళలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిం చారు. వివరాల్లోకి వెళితే పి.గన్నవరం మండలం ముక్తేశ్వరం గ్రామంకు చెందిన జనిపల్లి సంధ్య భర్తను కోల్పోయి పిల్లలతో ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతుంది. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ సంధ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేలు చెక్కును తక్షణ సహాయంగా అందించారు. ఇద్దరు పిల్లలకు మంచి విద్యాబుద్ధులు చెప్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. పిల్లల చదువుకు తోడ్పాటు అందిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మంత్రి సుభాష్ సేవ గుణానికి ఆ మహిళ కృతజ్ఞతలు తెలిపింది.

# కరువు భత్యం చెల్లింపుపై హర్షం

ధవళేశ్వరం,మేజర్‌న్యూస్ : విశ్రాంత ఉద్యోగులు, ప్రభుత్వోద్యోగులకు కరువు బత్యం కిస్తీ రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ హర్షంవ్యక్తం చేసింది, అద్యక్షులు యర్రమోతు ధర్మరాజు అద్యక్షతన సంఘ భవనంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రం లోగల అన్ని ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి, మన సమస్యలు స్వయంగా విచారించినందుకు క్రుతజ్ఞతలు తెలియ జేసింది, గత ప్రభుత్వంలో పీఆర్సీలో తాత్కాలిక భ్రుతి కంటే ఫిట్మెంట్‌లో కోత, క్వాంటమ్‌లో కోత, రవాణాబత్యం (టీఏ బిల్లు) అర్జిత శలవు ఇవ్వక, ఏపీజీఎల్ఐ, జీపిఎఫ్ చెల్లింపులు నిలిపివేత, పదవీ విరమణ చేసిన వారికీ రాయితీలు బట్వాడా చేయకుండా,మరణించిన వారికి మట్టిఖర్చులు చెల్లించకుండా,డీఏ బకాయిలు చెల్లించకుండా సదరు సొమ్ములో ఆదాయపన్ను తగ్గింపు ఇటువంటివి దేశ చరిత్రలో ఏరాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి దారుణాలకు ఒడిగట్టలేదన్నారు,ఎప్పుడు పింఛన్లు, జీతాలు పడతాయో తెలియక బ్యాంకుల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగి విసుపోయిన వర్గాలకు, చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రతీనెలా మొదటి తేదీనే జీతాల చెల్లించడం తోపాటు నిన్న కరువుబత్యం ప్రకటన పద్నాలుగు లక్షలకుటుంబాలలో సంతోషం నింపిందని ధర్మరాజు వివరించారు, ఉద్యోగ,పెన్షనర్లకు గత ప్రభుత్వం బకాయిపెట్టిన వేలకోట్లు అంచెలంచెలుగా చెల్లిస్తారనే ధీమా ఏర్పడింది,



ప్రధాన కార్యదర్శి దువ్వూరి కామేశ్వరశర్మ, కోశాదికారి ఉర్రింకల సత్యనారాయణ, వి. వెంకటేశ్వర్లు, తోరం కేశవరావు, బండారు రవీంద్ర, నల్లి విజయ మోహన్, సిహెచ్. నరసింహా రావు, విన్నకోట సాంబశివరావు, శ్రీరంగం వెంకటేశ్వరరావు, కొండా సూర్యనారాయణ, డిఏజెబి ప్రసాద్,శ్రీరాములు,సుబ్బారావు, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

– సిఐ విజయశంకర్

**పెద్దాపురం,మేజర్‌న్యూస్:** బాణాసంచా దుకాణదా రులు ప్రభుత్వ నిబంధనలు తుచ తప్పకుండా పాటించాలని,అలాగే ప్రతీ దుకాణ దారుడు తాత్కాలిక లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, జాగ్రత్తలు పాటిం చాలని, ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించాలనిసిఐ విజయశంకర్ దుకాణదారులకు సూచించారు. ఆదివారం పెద్దాపురం పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణాసంచా దుకాణాలను ఆయన పరిశీ లించి, దుకాణ దారులకు పలు ఆదేశాలు చేశారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయరాదని, నిర్దేశించిన ప్రదేశాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఆయన సూచించారు. దీనిలో భాగంగా పట్టణంలోని స్థానిక ఇరిగేషన్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణాసంచా దుకాణాలను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు.

